క్లుప్తంగా

కేజీబీవీ హాస్టళ్ల ఆకస్మిక తనిఖీ



రిజిస్టర్‌లను పరిశీలిస్తున్న మేజిస్ట్రేట్ తేజస్వి

కుక్కునూరు: రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ ఆదేశాల మేరకు శనివారం కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లోని కేజీబీవీ హాస్టళ్లను జంగారెడ్డిగూడెం జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్ క్లాస్ కేఎస్ఆర్ తేజస్వి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె హాస్టల్ గదులు, తరగతి గదులు, కాలేజ్, హాస్టల్ ఆవరణలోని పరిసరాలను పరిశీలించారు. హాస్టల్‌లో మరుగుదొడ్ల నిర్వహణ, నీటివసతి, విద్యుత్ సౌకర్యం, ఆటస్థలాలను, భోజనాన్ని పరిశీలించారు. ప్రతిరోజు అమలు చేస్తున్న మెనూపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. రికార్డులను పరిశీలించారు. హాస్టల్‌లో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఆరా తీశారు.

రోడ్ల మరమ్మతులకు నిధుల మంజూరు

కామవరపుకోట: రోడ్డు భవనాల శాఖ పరిధిలో మండలంలోని రహదారుల తాత్కాలిక మరమ్మతులకు నిధులు మంజూరైనట్లు, కొన్ని టెండర్ ప్రక్రియలో ఉన్నట్లు ఆర్అండ్‌బీ ఏఈ సుందర్‌రావు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. లింగపాలెం మండలంలో రంగాపురం నుంచి కళ్ళ చెరువు మీదుగా తడికలపూడి వరకు రోడ్డు మరమ్మతులు నిమిత్తం రూ.16 లక్షలు, ఏలూరు జంగారెడ్డిగూడెం వయా తడికలపూడి, దేవులపల్లి మధ్య రోడ్లకు రూ.24 లక్షలు మంజూరయ్యాయని, త్వరలో పనులు ప్రారంభిస్తామని తెలిపారు. ,ధర్మాజీగూడెం నుంచి జీలకర్రగూడెం అడ్డ రోడ్డు మరమ్మతులకు రూ.20 లక్షలు, చింతలపూడి నుంచి కామవరపుకోట రోడ్డుకు రూ.30 లక్షలు టెండర్ ప్రక్రియలో ఉన్నాయన్నారు. రంగాపురం నుంచి తడికలపూడి వయా కళ్ళచెరువు వద్ద గల గుండేరు వాగుపై ఉన్న రోడ్డుకు రూ.6 కోట్లతో నిర్మాణం కొరకు ప్రతిపాదనలు పంపించినట్లు ఆయన తెలిపారు.

పారిజాతగిరిలో విశేష పూజలు

జంగారెడ్డిగూడెం: స్థానిక పారిజాతగిరిలో శ్రీవేంకటేశ్వరస్వామివారికి శనివారం విశేష పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో స్వామివారిని దర్శించుకున్నారు. జంగారెడ్డిగూడెంకు చెందిన మాదల రామ్మోహన్ రావు, దమయంతి, వారి కుటుంబసభ్యులు భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. అర్చకులు నల్లూరి రవికుమార్ ఆచార్యులు, రాఘవాచార్యులు దాతలకు స్వామివారి శేష వస్త్రాలు, ప్రసాదాలు అందించి ఆశీర్వదించారు. గోపాలపురం మండలం గోపవరం గ్రామానికి చెందిన శ్రీవేంకటేశ్వర గానామృతం బృందం ఆధ్వర్యంలో 95వ శ్రీనివాస కళ్యాణం నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారిని కీర్తిస్తూ ఆలపించిన పాటలు భక్తులను ఆకట్టుకున్నాయి.

చండీహోమం



విజయదుర్గమ్మ ఆలయంలో చండీహోమం నిర్వహిస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం: మూలా నక్షత్రం పురస్కరించుకుని పట్టణంలోని విజయదుర్గమ్మ ఆలయంలో చండీహోమం నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు సుదర్శనం వేణుగోపాలాచార్యులు పర్యవేక్షణలో 19వ చండీహోమం నిర్వహించినట్లు కమిటీ చైర్మన్ మారిశెట్టి రాధాకృష్ణ తెలిపారు. భక్తులచే శ్రీచక్రార్చన అభిషేకాది పూజలు నిర్వహించినట్లు కమిటీ ప్రధాన కార్యదర్శి మాడ రామ్మోహనరావు తెలిపారు. కొయ్యలగూడెంకు చెందిన మాటూరు పంచాక్షరి, ధనలక్ష్మి దంపతులు విజయదుర్గ అమ్మవారికి 108 రజిత పుష్పాలు సమర్పించారు. అమ్మవారి వెండి చీరకు కర్పూరం బాల భవ్యశ్రీ 11 గ్రాముల వెండి బహూకరించారు. శీమకుర్తి సూర్యచంద్రరావు ద్రవ్యసహాయంతో భక్తులకు ప్రసాద వితరణ చేశారు.

మానవత శాంతి ర్యాలీ



ద్వారకాతిరుమలలో మానవత శాంతి ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

ద్వారకాతిరుమల: మానవత స్వచ్ఛంద సేవా సంస్థ మండల శాఖ ఆధ్వర్యంలో శనివారం ద్వారకాతిరుమలలో మానవత శాంతి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సంస్థ సభ్యులు మాట్లాడుతూ దాతల విరాళాలతో మానవత సంస్థ సేవలు రాష్ట్రంలోని 13 జిల్లాలకు విస్తరించాయన్నారు. ప్రతి ఏటా మాదిరిగానే ఈనెల 15 నుంచి 22 వరకు మానవత శాంతి వారోత్సవాలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ఈ ర్యాలీలో పాల్గొన్న ద్వారకాతిరుమల, తణుకు మండలాలకు చెందిన ప్రముఖ కార్యవర్గ సభ్యులు, దాతలు ర్యాలీ విజయవంతానికి కృషి చేసిన శ్రీనివాస కళాశాల విద్యార్థులను అభినందించారు.

వైద్యుల నిరసన గళం



జంగారెడ్డిగూడెం: సాయిస్ఫూర్తి ఆసుపత్రి వద్ద మౌమిత దేవనాద్‌కు నివాళులు అర్పిస్తున్న వైద్యులు, సిబ్బంది

చింతలపూడి: కోల్‌కతాలో పీజీ వైద్య విద్యార్థినిపై జరిగిన అత్యాచారం, హత్యను ఖండిస్తూ చింతలపూడి ఏరియా ఆసుపత్రి వైద్యులు, వైద్య సిబ్బంది నిరసన తెలిపారు. శనివారం ఆసుపత్రి నుంచి వైద్యులు, సిబ్బంది ర్యాలీ జరిపి నిందితుల్ని కఠినంగా శిక్షించాలని, వైద్యులకు రక్షణ కల్పించాలని కోరుతూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ కమ్యూనిటీ ఆసుపత్రి సూపరింటెండెంట్ డా రసూల్ మాట్లాడుతూ ప్రజారోగ్యాన్ని కాపాడే మహిళా వైద్యులపై అత్యాచార ఘటనలు జరగడం శోచనీయమన్నారు. ఘటనకు బాధ్యులైన వారిపై వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు కోంద్రు దేవ, ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

యావత్ భారతావని తలదించుకోవాల్సిన ఘటన

జంగారెడ్డిగూడెం: కోల్‌కతా ఆర్‌జీకార్ ప్రభుత్వ కళాశాలలో మహిళ వైద్యురాలిపై హత్యాచారం ఘటనను నిరసిస్తూ జంగారెడ్డిగూడెంలో శనివారం ఆసుపత్రుల బంద్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐఎంఏ ఆధ్వర్యంలో పట్టణంలో భారీ కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ప్రధాన సెంటర్‌లో మానవహారం నిర్మించి, మృతి చెందిన పీజీ వైద్య విద్యార్థిని డాక్టర్ మౌమిత దేవనాధ్‌కు నివాళులు అర్పించారు. ఐఎంఏ అధ్యక్ష, కార్యదర్శులు కె.వజ్రకిరణ్, కాకర్ల రామచంద్ర బాబు మాట్లాడుతూ ఇది యావత్ భారతావని తలదించుకోవాల్సిన ఘటన అని అన్నారు. వైద్యురాలి ప్రాణాలు తీసిన దుండగులు ఎంతటి వారైనా కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ప్రత్యేక కోర్టు ఏర్పాటు చేసి, సీబీఐ ఆధ్వర్యంలో త్వరితగతిన నేర పరిశోధన పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ, ప్రైవేట్ వైద్యులు, సిటీకేబుల్ ఎండీ పాలపర్తి శ్రీనివాస్, ఆసుపత్రుల వైద్య సిబ్బంది, వైద్యేతర సిబ్బంది, రోటరీ, లయన్స్‌క్లబ్ ప్రతినిధులు పాల్గొన్నారు. సాయిస్ఫూర్తి మల్టీస్పెషాలిటీ ఆసుపత్రి ఆధ్వర్యంలో పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. తొలుత ఆసుపత్రి వద్ద మౌమిత దేవనాధ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఆసుపత్రి ఎండీలు డాక్టర్ రామకృష్ణ, నామ శ్రీనివాస్, వాసిరెడ్డి శ్రీనివాస్, డాక్టర్లు మురళీకృష్ణ, సోనిక, సీతారం, రత్న, శ్వేత, లీత, అభిషేక్, నవీన్, దిలీప్, నాగబాబు, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు. జంగారెడ్డిగూడెం ప్రభుత్వ ప్రాంతీయ ఆసుపత్రి వైద్యులు, వైద్యేతర సిబ్బంది ఆసుపత్రి నుంచి స్థానిక అశ్వారావుపేట రోడ్డు వరకు ర్యాలీ నిర్వహించారు. మౌమిత దేవనాధ్ ఆత్మకు శాంతి చేకూరాలని నివాళులు అర్పించారు. దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

బుట్టాయగూడెంలో భారీ ర్యాలీ

బుట్టాయగూడెం: వైద్యవిద్యార్థిని హత్యను నిరసిస్తూ శనివారం బుట్టాయగూడెంలో స్థానిక సామాజిక ఆరోగ్యకేంద్రం వైద్యులు, సిబ్బంది, విద్యారోహిణీ డిజిటల్ స్కూల్, స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల, జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థినీ విద్యార్థులు, ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. వైద్యుల రక్షణ ప్రభుత్వ బాధ్యత అని నినదించారు. సీహెచ్‌సీ సూపరింటెండెంట్ భవిష్యత్‌లో ఇటువంటి సంఘటన చోటుచేసుకోకుండా దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించి అనంతరం ఇన్‌చార్జి తహసీల్దార్ రమేష్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ హేమంత్, డాక్టర్ జనార్ధన్, వైద్యసిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

కొయ్యలగూడెం: ఉయ్ వాంట్ జస్టిస్ అంటూ వైద్యులు నినాదాలు చేస్తూ శనివారం రోడ్డెక్కారు. తమ విధులను బహిష్కరించి నిరసన వ్యక్తం చేశారు. కోల్‌కతాలోని డాక్టర్ మౌమితా దేవనాథ్‌పై అఘాయిత్యానికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. నానాటికి దేశంలో మహిళలకు రక్షణ లేకుండా పోతుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. జాతీయ ప్రధాన రహదారిపై వంద మందికి పైగా వైద్య ఆరోగ్యశాఖకి చెందినవారు నినాదాలు చేస్తూ తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన నిర్వహించారు. అనంతరం తహసీల్దార్‌కి వినతిపత్రం సమర్పించారు.

నల్లబ్యాడ్జీలతో నిరసన

కుక్కునూరు: వైద్య విద్యార్థిని మృతికి నిరసనగా శనివారం కుక్కునూరు పీహెచ్‌సీ వైద్యులు, సిబ్బంది నల్లబ్యాడ్జీలతో విధులకు హాజరై నిరసన తెలిపారు. పీహెచ్‌సీ వైద్యులు సీహెచ్ పూర్ణ శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రాణం పోసే డాక్టర్‌పై పాశవికంగా అత్యాచారం చేసి హత్య చేసిన దుండగులను కఠినంగా శిక్షించాలని కోరారు. ఇకపై ఏ మహిళకు ఇటువంటి ఘటనలు జరగకుండా ప్రభుత్వాలు కఠిన చర్యలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

మహిళలకు రక్షణ కల్పించండి

టి.నరసాపురం: మహిళలకు రక్షణ కల్పించాలని వైద్య రంగం, మేధావులు గొంతెత్తారు. కోల్‌కతా ఆర్‌జీకర్ వైద్య కళాశాలలో మహిళా డాక్టర్ పై జరిగిన అత్యాచారం, హత్యలను ఖండిస్తూ, శనివారం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి నుంచి టి.నరసాపురం ప్రధాన వీధుల్లో నిరసన ప్రదర్శన నిర్వహించారు. అరసం రాష్ట్ర కార్యదర్శి బీఎన్ సాగర్, మండల వైద్యాధికారి డాక్టర్ జె.కల్పనారాణి మాట్లాడుతూ మహిళల ఆలోచనలు, ఆశయాలను, వారి వ్యక్తిగత స్వేచ్ఛను గుర్తించి మెలగాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. మన ఇళ్లల్లో మగపిల్లలకు కుటుంబసభ్యులనే కాక, మిగిలిన మహిళలను కూడా అమ్మలా, అక్కలా, చెల్లిలా చూడటం నేర్పాలన్నారు. డాక్టర్ ఆర్.ఫణీంద్రబాబు, ఎంఎస్‌వో ఖాదర్ భాషా, విజన్ స్కూల్ ప్రిన్సిపాల్ పి.శ్రీనివాస్, పలువురు కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు, ఆశా కార్యకర్తలు, వివిధ పాఠశాలల విద్యార్థినులు పాల్గొన్నారు.

వేలేరుపాడులో వైద్యుల నిరసన

వేలేరుపాడు: కోలకతాలో వైద్యురాలి దారుణ హత్యకు నిరసనగా వేలేరుపాడు మండల వైద్యాధికారులు విధులను బహిష్కరించి నిరసన తెలిపారు. ఇక్కడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి వేలేరుపాడు ఆటోసెంటర్ వరకు నల్లబ్యాడ్జీలు ధరించి ప్రదర్శన నిర్వహించారు. అనంతరం ఆటోసెంటర్‌లో మానవహారం నిర్వహించారు. ఆ తర్వాత వేలేరుపాడు డిప్యూటీ తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో వైద్యులు అగత, అకీబ్ షరీఫ్, గణేష్, ఆరోగ్య కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

దోషులను కఠినంగా శిక్షించాలి



బుట్టాయగూడెం: కోల్‌కతాలోని ఆర్‌జీకేఏఆర్ మెడికల్ కాలేజీ సెకండ్ ఇయర్ పీజీ విద్యార్థిని హత్యను మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు తీవ్రంగా ఖండించారు. శనివారం సాయంత్రం మండలంలోని దుద్దుకూరులో ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ దేశంలో నానాటికీ మహిళల మీద ఘోరాలు అడ్డూ అదుపులేకుండా జరుగుతున్నాయని అన్నారు. ప్రభుత్వాలు మహిళలకు రక్షణ కల్పించడంలో ఘోరంగా విఫలమవుతున్నారని అన్నారు. మహిళలకు పూర్తి రక్షణ కల్పించే విధంగా కృషి చేయాలని అన్నారు. భవిష్యత్‌లో ఇటువంటి సంఘటనలు చోటు చేసుకోకుండా దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

దుద్దుకూరులో విలేకర్లతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు



కొయ్యలగూడెం: ఉయ్ వాంట్ జస్టిస్ అంటూ ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యులు, వైద్య సిబ్బంది



బుట్టాయగూడెం: ఇన్‌చార్జి తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న వైద్యుల బృందం



చింతలపూడి: ప్రభుత్వ ఆసుపత్రి వద్ద రోడ్డుపై నిరసన తెలుపుతున్న వైద్యులు, వైద్య సిబ్బంది



కుక్కునూరు: పీహెచ్‌సీ వద్ద నిరసన తెలుపుతున్న పీహెచ్‌సీ సిబ్బంది


అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలి



మాట్లాడుతున్న ఎంపీపీ జ్యోతి, జెడ్పీటీసీ బాబ్జి

జంగారెడ్డిగూడెం రూరల్: అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేస్తూ ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఎంపీపీ కొదమ జ్యోతి అన్నారు. జంగారెడ్డిగూడెం మండల పరిషత్ సర్వసభ్య సమావేశ మందిరంలో శనివారం మండల పరిషత్ సరసభ్య సమావేశం ఎంపీపీ జ్యోతి అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో అధికారులు సంక్షేమ పథకాలు, సబ్సిడీలను వివరించారు. ప్రజాప్రతినిధులు వారి గ్రామాల్లో నెలకొన్న సమస్యలను సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా ఎంపీపీ జ్యోతి మాట్లాడుతూ వర్షాకాలం కావడంతో గ్రామాల్లో పారిశుధ్య పనులపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు. గ్రామాలు పరిశుభ్రంగా ఉంచేలా ఎప్పటికప్పుడు చర్యలు చేపట్టాలన్నారు. జ్వరాలు ప్రబలకుండా తీసుకోవాల్సిన చర్యలపై వైద్య సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. జెడ్పీటీసీ పోల్నాటి బాబ్జి మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులోకి ఇసుక, మట్టిని అందించేలా చూడాలని సభ్యులు సమావేశం దృష్టికి సభ్యులు తీసుకురావడం జరిగిందన్నారు. ఇసుక, మట్టి సమస్య లేకుండా చూడాలని ఎమ్మెల్యే ద్వారా కలెక్టర్‌కి నివేదిక అందజేసే ప్రయత్నం చేస్తామని తెలిపారు. సభ్యులు అనుమతితో రూ.30 లక్షల నిధులు ఖర్చు చేసేందుకు ప్రణాళికలు చేస్తామని బాబ్జి అన్నారు. ఈ సమావేశంలో తహసీల్దార్ స్లీవజోజి, ఎంపీడీవో కె.విజయ్ ప్రసాద్ పాల్గొన్నారు.

అధికారులు బాధ్యతగా పనిచేయాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రోషన్ కుమార్

చింతలపూడి: ప్రజలకు జవాబుదారీతనంగా ఉంటూ బాధ్యతగా వ్యవహరించాలని ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్ అధికారులకు సూచించారు. చింతలపూడి మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ బి రాంబాబు నాయక్ అధ్యక్షతన స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో శనివారం జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే రోషన్ కుమార్ మాట్లాడుతూ సమస్యలపై వచ్చే ప్రజల పట్ల ఆదరణ చూపాలన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేసి ప్రభుత్వానికి, నియోజకవర్గానికి మంచిపేరు తీసుకురావాలని కోరారు. అనంతరం శాఖలవారీగా సమీక్ష నిర్వహించారు. మండలంలో రహదారులను తక్షణం మరమ్మతులు చేపట్టాలని పలువురు ప్రజాప్రతినిధులు అధికారులను కోరారు. సమావేశంలో జెడ్పీటీసీ ఎం నీరజ, ఎంపీడీఓ మురళీకృష్ణ, మండల పరిషత్ 1, 2 ఉపాధ్యక్షులు ఎస్ వరలక్ష్మి, గుత్తా కిషోర్ పాల్గొన్నారు.

ఉచిత నేత్ర వైద్య శిబిరం



బయ్యనగూడెంలో ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహిస్తున్న దృశ్యం

కొయ్యలగూడెం: గ్రామీణ ప్రాంతాల్లో ఉచిత నేత్ర వైద్య శిబిరాల నిర్వహణ మరింతగా పెరగాలని ఏఎంసీ మాజీ వైస్‌చైర్మన్ మద్దు బాలనాగేశ్వరరావు పేర్కొన్నారు. శనివారం బయ్యనగూడెం గ్రామంలో ఏలూరుకి చెందిన ఈశ్వర్ నేత్రాలయ హాస్పటల్ వారిచే ఏర్పాటుచేసిన ఉచిత నేత్ర వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా కంటి సమస్యలతో బాధపడుతున్న వివిధ వర్గాల వారికి పరీక్షలు నిర్వహించారు. ఉచితంగా ఔషధాలను అందజేసి కళ్లజోళ్లు అవసరమైన వారిని గుర్తించారు. శస్త్ర చికిత్సలు అవసరమైన వారికి ఉచితంగా నిర్వహిస్తామని శిబిరం నిర్వాహకులు పేర్కొన్నారు. వైద్యశిబిరంలో బాలం నరేష్, జెడ్పీ హైస్కూల్ వైస్ ప్రెసిడెంట్ కలవగంటి శ్రీను, బవిరిశెట్టి సత్తిబాబు, ఎం.తేజ విశ్వనాథ్, సెంట్రింగ్ శ్రీను, ఆరేటి ఏసుబాబు రోగులకు సేవలు అందించారు.

మలాథియాన్ స్ప్రేయింగ్ పనుల పరిశీలన

బుట్టాయగూడెం: మండలంలోని మారుమూల గ్రామాలైన గొట్టాలరేవు, చింతకొండ, రెడ్డిబొడ్డేరు గ్రామాల్లో జరుగుతున్న రెండో విడత మలాథియాన్ స్ప్రేయింగ్ పనులను శనివారం సబ్ యూనిట్ ఆఫీసర్ పెద్దిరాజు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత వాతావరణ పరిస్థితుల దృష్ట్యా ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా దోమల నివారణపై రెండో విడత స్ప్రేయింగ్ పనులను చేస్తున్నామని అన్నారు. ప్రజలు ఇళ్లల్లో కూడా ఈ పనులు చేయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది మీనా, రాధ, రవీంద్ర, గంగారత్నం, కన్నపరాజు, భవానీ, మంగతయారు, తదితరులు పాల్గొన్నారు.

బాధ్యులను కఠినంగా శిక్షించాలి

కుక్కునూరు: పీజీ ట్రైనీ డాక్టర్ మౌమిత దేవనాద్ అత్యాచార ఘటనపై ఆర్‌జీకార్ కళాశాల ప్రిన్సిపాల్, సూపరింటెండెంట్‌లపైనా కేసులు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని సీపీఐఎంఎల్ మాస్‌లైన్ ప్రజాపంథా జంగారెడ్డిగూడెం డివిజన్ అధ్యక్షుడు షేక్ గౌస్ డిమాండ్ చేశారు. శనివారం సీపీఐఎంఎల్ ప్రజాపంథా కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ట్రైనీ డాక్టర్‌పై జరిగిన అత్యాచార, హత్య ఘటనను పార్టీ తీవ్రంగా ఖండిస్తుందన్నారు. ఈ ఘటనపై దేశ వ్యాప్తంగా డాక్టర్‌లు, ప్రజా సంఘాలు నిరసన కార్యక్రమాలు జరుపుతున్నప్పటికీ కేంద్ర ప్రభుత్వం కనీసం స్పందించలేదని ఆయన విమర్శించారు. మహిళలను రక్షణకు అనేక చట్టాలు ఉన్నప్పటికీ అత్యాచార ఘటనలు మాత్రం ఆగకపోవడం శోచనీయమని అన్నారు.

మిషన్ వాత్సల్య నిధులు విద్య, వైద్యానికే



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా బాలల సంరక్షణ అధికారి చక్రవేణి

కొయ్యలగూడెం: మిషన్ వాత్సల్య పథకం ద్వారా నగదు పొందిన విద్యార్థులకు వారి విద్యా వైద్యానికి మాత్రమే సొమ్ములను సంరక్షకులు వినియోగించాలని డీసీపీవో (జిల్లా బాలల సంరక్షణ అధికారిని) చక్రవేణి పేర్కొన్నారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో ఐసీడీఎస్ పీఓ యు.ఎన్.స్వర్ణకుమారి ఆధ్వర్యంలో మిషన్ వాత్సల్య లబ్ధిదారులతో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. కరోనా సమయం నుంచి తల్లిదండ్రులను కోల్పోయిన, ఇద్దరిలో ఏఒక్కరిని కోల్పోయిన పిల్లల ఆర్థిక అవసరాల నిమిత్తం స్కాలర్‌షిప్‌గా మిషన్ వాత్సల్య పథకం వర్తింప చేయటం జరిగిందన్నారు. ఈనేపథ్యంలో 2022 సంవత్సరం నుంచి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యార్థుల అకౌంట్‌కి ఆరు నెలలకి కలిపి రూ.24 వేల చొప్పున జమ చేస్తూ వస్తుందన్నారు. ఆవిధంగా సంవత్సరానికి రెండు విడతలుగా సొమ్ములు జమ అవుతాయన్నారు. ప్రస్తుత సంవత్సరానికి ఆరు నెలలకి సంబంధించి లబ్ధిదారులకు సొమ్ములు జమ చేయడం జరిగిందన్నారు. జిల్లా వ్యాప్తంగా 502 మందికి ఈ పథకం ద్వారా ప్రయోజనం పొందుతున్నారన్నారు. అర్హత కలిగిన వారు ఇప్పటికీ కూడా దరఖాస్తు చేసుకోవచ్చు అని అందుకు ఐసీడీఎస్ శాఖను సంప్రదించాల్సిందిగా సూచించారు. బాల బాలికలు అత్యవసర సమయాలలో 1098 టోల్ ఫ్రీ నెంబర్‌కు సంప్రదించి రక్షణ పొందాలని సూచించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు మాట్లాడుతూ గత ప్రభుత్వం కుటుంబంలోని ఇద్దరు విద్యార్థులకు పథకాన్ని వర్తింప చేశారని, ఈ దఫా కుటుంబంలో ఒకరికి మాత్రమే వర్తింప చేయడం వల్ల నష్టపోతున్నామని సీడీపీఓ దృష్టికి తీసుకువెళ్లారు. నూతన విధానాలలో అనుసరించి నగదు వేయడం జరిగిందని, అయితే ప్రభుత్వం దృష్టికి సమస్యను తీసుకువెళతామని ఆమె పేర్కొన్నారు. తహసీల్దార్ కె.చెల్లన్నదొర, ఐసీడీఎస్ శాఖ అధికారులు రాజేష్, అంబటి సరస్వతి, ఎ.నయోమిరాణి, వెంకాయమ్మ, శ్రీదేవి సూర్జహాన్ తదితరులు పాల్గొన్నారు.

రెడీమిక్స్ లారీ బోల్తా.. డ్రైవర్ మృతి

ద్వారకాతిరుమల: కాంక్రీట్ లోడుతో వెళుతున్న ఒక రెడీమిక్స్ లారీ అదుపుతప్పి బోల్తా పడిన ఘటనలో డ్రైవర్ అక్కడికక్కడే మృతి చెందాడు. వివరాలిలా ఉన్నాయి. సోమవరప్పాడులోని శ్రీబాలాజీ రెడీమిక్స్ ఇండస్ట్రీ వారు, ద్వారకాతిరుమల మండలం పి.కన్నాపురంలోని ఓ ఫ్యాక్టరీకి రెడీమిక్స్ కాంక్రీట్‌ను సప్లయ్ చేస్తున్నారు. ఈ క్రమంలో కాంక్రీటు లోడుతో శనివారం ఫ్యాక్టరీకి వెళుతున్న ఓ లారీ ఎం.నాగులపల్లి వద్దకు వచ్చేసరికి అదుపుతప్పి రోడ్డు పక్కన డ్రెయినేజీ కల్వర్టులోకి దూసుకెళ్లి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో తీవ్రగాయాల పాలైన ఒడిశా రాష్ట్రం ముసపల్లికి చెందిన లారీ డ్రైవర్ పటిడి కులేసిక (28) అక్కడికక్కడే మృతి చెందాడు. ఘటనా స్థలాన్ని ద్వారకాతిరుమల పోలీసులు పరిశీలించారు. శ్రీ బాలాజీ రెడీమిక్స్ ఇండస్ట్రీ మేనేజర్ సత్తి వెంకట ఫణికుమార్ ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ దుర్గారావు చెప్పారు.

రెండు వర్గాల మధ్య ఘర్షణ

జంగారెడ్డిగూడెం: రెండు వర్గాల మధ్య మంచినీటి ట్యాంకు విషయమై జరిగిన ఘర్షణ తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. జంగారెడ్డిగూడెం పట్టణంలోని బుట్టాయగూడెం రోడ్‌లో శనివారం జరిగిన ఈ ఘటనకు సంబంధించి స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణానికి చెందిన పిండి రాము అనే వ్యక్తికి చెందిన ఖాళీ స్థలంలో, స్థలానికి ఆనుకుని ఉన్న ప్రైవేట్ పిల్లల ఆసుపత్రికి చెందిన మంచినీటి ట్యాంక్‌ను ఉంచారు. గత కొద్దిరోజులుగా మంచినీటి ట్యాంక్‌ను స్థలం ముందు నిలిపి ఉంచడంతో రాము అభ్యంతరం తెలుపుతున్నాడు. ఈ క్రమంలో శనివారం ఆసుపత్రి యాజమాన్యానికి మంచినీటి ట్యాంక్‌ను తొలగించాలని చెప్పాడు. ఈ క్రమంలో ఆసుపత్రికి చెందిన నరేష్ అనే వ్యక్తికి, రాము, అతని వెంట వచ్చిన వ్యక్తుల మధ్య వాగ్వివాదం చోటు చేసుకుంది. ఇది తీవ్రమై ఒకరిపై మరొకరు దాడి చేసుకునే పరిస్థితి ఏర్పడింది. భారీస్థాయిలో జనం గొడవకు దిగడంతో సమాచారం అందుకున్న జంగారెడ్డిగూడెం, లక్కవరం ఎస్సైలు జ్యోతిబాస్, సుదీర్ బాబు తమ సిబ్బందితో కలిసి ఇరువర్గాలను చెదరగొట్టారు.

ట్రాన్స్‌ఫార్మర్‌లో రాగివైరు చోరీపై కేసు నమోదు

టి.నరసాపురం: విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లలోని రాగివైరు చోరీ చేసిన ఘటనలపై కేసులు నమోదు చేసినట్లు ఎస్సై డి.దుర్గామహేశ్వరరావు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని సీతంపేట, మక్కినవారిగూడెం, బంధంచర్ల, అల్లంచర్లరాజుపాలెం గ్రామాల్లో 6 మంది రైతులకు సంబంధించిన వ్యవసాయ పొలాల్లో ఉన్న 6 విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ధ్వంసమయ్యాయి. గుర్తు తెలియని వ్యక్తులు వాటిని పగులగొట్టి అందులోని రాగివైరును చోరీ చేశారని బాధిత రైతులు ఫిర్యాదు చేశారు. వారు ఇచ్చిన ఫిర్యాదు మేరకు రెండు కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఉత్తమ వీఆర్వోకి అభినందనలు



వీఆర్‌వో మక్బుల్‌ను అభినందిస్తున్న అసోసియేషన్ నాయకులు

కొయ్యలగూడెం: ఉత్తమ వీఆర్వోగా ఎంపికైన మంగపతిదేవిపేట వీఆర్‌వో ఎస్‌కే మక్బుల్‌ని వీఆర్‌వో అసోసియేషన్ నాయకులు అభినందించారు. శనివారం తహసీల్దార్ కార్యాలయం వద్ద జంగారెడ్డిగూడెం డివిజన్ వీఆర్వో అసోసియేషన్ అధ్యక్షుడు అడపా రాంబాబు ఆధ్వర్యంలో అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఇరవై సంవత్సరాలుగా రెవెన్యూ శాఖలో మక్బుల్ విశేష సేవలందించారని రాంబాబు పేర్కొన్నారు. అనంతరం తహసీల్దార్ కె.చెల్లన్న దొర ఆయన్ను అభినందించారు. కార్యక్రమంలో వీఆర్వోలు మధు, సుబ్బారావు, శ్రీనివాస్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి రూ.3 లక్షల విరాళం

కొయ్యలగూడెం: తాడేపల్లిగూడెం మండలం కుంచనపల్లి గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న శ్రీదేవి భూదేవి సమేత శ్రీ కళ్యాణ వేంకటేశ్వర స్వామి వారి ఆలయంలో విగ్రహాల ఏరాపటు నిమిత్తం కొయ్యలగూడెంకి చెందిన నిడదవోలు వినయ్ భవాని రామ్ దంపతులు శనివారం రూ.3 లక్షలు విరాళంగా అందజేశారు. ఆలయ కమిటీ సభ్యులకు విరాళం చెక్కును అందించారు. ఈ సందర్భంగా దాతలను కమిటీ సభ్యులు ఘనంగా సత్కరించారు.